క్లుప్తంగా

ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలి



కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): టీజీవీ గ్రాక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విస్తరించే పీటీఎఫ్ఈ పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణారెడ్డి, పీఎస్ రాధాకృష్ణ, భాస్కరరెడ్డి, ఎండీ ఆనంద్‌బాబు, శ్రీనివాసరావు, జి.రామకృష్ణ, షేక్షావలి, నాగన్న, చంద్రశేఖరరెడ్డి, డేవిడ్, మహేష్, మునిస్వామి కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం వారు కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిశోర్‌కుమార్ రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజలను ప్రమాదంలోకి నెట్టే పరిశ్రమలు అవసరం లేదన్నారు. పర్యావరణంతో పాటు జీవ వైవిధ్యం దెబ్బతినే పరిశ్రమకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలన్నారు. పీటీఎఫ్ఈ తయారీకి విషతుల్యమైన రసాయనాలు వాడుతుండటంతో తుంగభద్ర నది కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు.

గ్రైండర్ వితరణ

కర్నూలు(అర్బన్): ఆవోపా ఆవిర్భావకర్త దివంగత కుట్ర రుద్రప్ప గారి కృష్ణయ్య శెట్టి జయంతి సందర్భంగా మంగళవారం ఆవోపా నేతలు నగరంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పాతబస్టాండ్ సమీపంలోని వాసవీ ఏజెన్సీ ఎదురుగా మజ్జిగ పంపిణీ చేశారు. ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళ లీలావతికి గ్రైండర్ అందించారు. ఆవోపా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను శుభ్రం చేయండి

కర్నూలు(సెంట్రల్): వడ్డెగేరిలోని సామూహిక మరుగుదొడ్లను రెండు నెలల నుంచి శుభ్రం చేయకపోవడంతో వచ్చే దుర్వాసనను స్థానికులు భరించలేకపోతున్నారని సీపీఎం నగర కమిటీ సభ్యుడు అబ్దుల్‌దేశాయ్, షేక్ చాంద్‌బాషా, సిద్ధయ్య అన్నారు. మంగళవారం సీపీఎం బృందం మరుగుదొడ్లను పరిశీలించింది. మునిసిపల్ అధికారులు రెండు నెలల నుంచి మరుగుదొడ్లను ఎందుకు శుభ్రం చేయడం లేదని ప్రశ్నించారు. వసతులు లేకపోవడంతో మహిళలు మరుగుదొడ్డికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మూడు మాసాల క్రితం ఇద్దరు కానిస్టేబుళ్లు మృతిచెందారు. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది జీతాల నుంచి రూ.2.08 లక్షలు నగదు పోగు చేసి ఆర్థిక సహాయాన్ని అందించారు. పంచలింగాల చెక్‌పోస్టులో రామకేశవులు, మాధవరం చెక్‌పోస్టులో శ్రీనివాస్ సింగ్ విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందారు. అసోసియేషన్ సభ్యులంతా కలసి తమ జీతాల్లో నుంచి నగదును పోగు చేసి రామకృష్ణ భార్య సువర్ణ, శ్రీనివాస్ సింగ్ భార్య ఉమా బాయికి రూ.1.04 లక్షలు చొప్పున డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి చేతుల మీదుగా అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, నోడల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, తదితరులు ఉన్నారు. బాధిత కుటుంబాలకు అందాల్సిన పెన్షన్ సెటిల్‌మెంట్ ఆర్డర్ కాపీని నోడల్ ఈఎస్ సుధీర్‌బాబు చేతుల మీదుగా అందజేశారు.

హత్యకేసు నిందితుల అరెస్టు

కర్నూలు: కర్నూలు మండలం భూపాల్‌నగర్‌కు చెందిన బర్రెల కాపరి రఫీక్ (30) హత్య కేసులో ముగ్గురు మైనర్లను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. రఫీక్ కొన్నేళ్లుగా బర్రెల పెంపకంతో జీవనం సాగించేవాడు. ఈ నెల 8వ తేదీన బర్రెలు మేపడం కోసం పడిదెంపాడు గ్రామ పొలాల్లోకి తీసుకెళ్లాడు. అదే సమయంలో అక్కడ ముగ్గురు మేకల కాపరులు కూడా ఉన్నారు. మధ్యాహ్న సమయంలో ఒకరికొకరు మాట్లాడుకుంటూ మేకల కాపరుల్లోని ఒకరి సోదరుడిని కించపరుస్తూ రఫీక్ మాట్లాడినందుకు ఆవేశానికి లోనై చేతిలో ఉన్న కర్రతో బాది మేకలకు మేత కోసేందుకు తెచ్చుకున్న కొడవలితో గొంతు కోసి హత్య చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పక్కా ఆధారాలతో ముగ్గురు మైనర్లను అరెస్టు చేసి జువైనల్ కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేసే వరకు పోరాటం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేస్తామని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ ప్రకటించారు. మంగళవారం హరికిషన్ సుర్జీత్ భవన్‌లో ఆవాజ్ నగర కమిటీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ముస్లింలు, క్రిష్టియన్లు, దళితులను అణచి వేస్తోందన్నారు. నిరుద్యోగం పెరుగుతున్నా పట్టించుకోకుండా వక్ఫ్ ఆస్తులపై దృష్టి పెట్టిందని విమర్శించారు.

కూటమి పాలనలో ఏరులై పారుతున్న మద్యం

- వీధికో బెల్ట్ షాపు
- ప్రతి పనికి రేటుకట్టి వసూలు
- ప్రజల నమ్మకం కోల్పోయిన చంద్రబాబు ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శలు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వంలో వీధికొక బెల్ట్ షాపు ఏర్పాటు చేసి పల్లెల్లో మద్యాన్ని ఏరులుగా పారిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. ఆయన మంగళవారం సాయంత్రం సి.క్యాంపులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే తక్కువ రేటుకు క్వాలిటీ మద్యం అందిస్తామని చెప్పిన చంద్రబాబు ప్రస్తుతం పల్లెల్లో విచ్చలవిడిగా అనధికారిక మద్యం దుకాణాలు పెట్టుకొని అడ్డగోలుగా సంపాదిస్తున్నారన్నారు. ఇష్టానుసారంగా బెల్టుషాపులను ప్రభుత్వమే ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో ప్రభుత్వానికి సంబంధించిన ఏ చిన్న పని కావాలన్నా ఒక రేటు కట్టి అధికార పార్టీ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతలకు మద్యం, ఇసుక, అవినీతి ఉపాధి మార్గాలుగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రజలను అన్ని విధాల మోసం చేసిందని విమర్శించారు. ఏడాదిలోపే కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు.

మాజీ మంత్రి విడుదల రజినీ పట్ల ఖాకీ జులుం తగదు

మాజీ మంత్రి, బీసీ మహిళ విడుదల రజినీ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళల పట్ల ఈ ప్రభుత్వం దురుసుగా ప్రవర్తిస్తుందనడానికి ఈ సంఘటనే ఉదాహరణ అన్నారు. మాట్లాడితే అణిచివేసే విధానాలకు ఈ ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. మహిళలు, ప్రజాస్వామ్యవాదులందరూ ఈ దౌర్జన్యాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు.

ఖరీఫ్ సమీపిస్తున్నా పెట్టుబడి సాయం ఏదీ?

- రైతులను వంచించిన మోసకారి చంద్రబాబు
- పెట్టుబడులకు నగదు లేక రైతుల ఇబ్బందులు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

కర్నూలు (టౌన్): అన్నదాత సుఖీభవ అంటూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఊకదంపుడు ప్రచారం చేసి, ఇప్పుడు రైతుల ఊసే ఎత్తకపోవడం దారుణమని, ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా రైతన్నలకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి విమర్శించారు. ఆయన మంగళవారం స్థానిక సీతారామ నగర్‌లోని కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతి రైతును ఆదుకుంటామని చెప్పిన చంద్రబాబు ఒక్కరినైనా ఆదుకున్నారా అని ప్రశ్నించారు. గతేడాది గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. రైతన్నలకు అండగా నిలిచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రైతు భరోసా, గిట్టుబాటు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ పక్కాగా అమలు చేసి చూపించారని కొనియాడారు. ప్రస్తుతం ఖరీఫ్ సమీపిస్తున్న నేపథ్యంలో సామాన్య రైతులు భూమిని దుక్కి దున్నడం, విత్తన కొనుగోలు, సాగు చేయడం, కూలీల ఖర్చు ఎలా అనే ఆందోళనలో ఉన్నారని, వారికి ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

భూసేకరణ కేసులను త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): భూ సేకరణ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో భూసేకరణకేసుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్ల వారీగా ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ మండలంలో ఎన్ని కేసులు ఉన్నాయి? ఎంత పరిహారం చెల్లించాల్సి ఉందని ఆయా ఆర్‌డీఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూసేకరణకు సంబంధించి కేసులపై తక్షణం స్పందించాలని అధికారులను ఆదేశించారు. పరిహారం చెల్లింపులకు సంబంధించిన కేసులు ఉంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ అంశంపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని జేసీ డాక్టర్ బి.నవ్యకు సూచించారు. శాఖల వారీగా ఏఏ కేసులు ఉన్నాయి; ఎంత పరిహారంచెల్లించాలన్న నివేదికను సిద్ధం చేయాలని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మను ఆదేశించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో తాగునీటి సరఫరాపై ఆర్‌డీఓలు, ఎంపీడీఓలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్లు, మునిసిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మే నుంచి జూలై వరకు ఎక్కువగా తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, ఎక్కడా ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పత్రికల్లో తాగునీటి ఎద్దడిపై వచ్చే కథనాలపై స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ సమీక్ష చేసుకోవాలని, రక్షిత మంచినీటి పథకాలు, ట్యాంకులు, ఫిల్టర్లు, పంపిణీ వ్యవస్థ సరిగా ఉందో లేదో చూసుకోవాలన్నారు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల నిధులను వినియోగించుకొని నీటి పథకాలకు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, మంత్రాలయం, గోనెగొండ్ల, కౌతాళం, ఎమ్మిగనూరు, నందవరం, కోసిగి, హోళగుంద తదితర మండలాల్లో తాగునీటి ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలపై అధికారులతో ఆరా తీశారు. పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలనిమునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ భరత్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముదిరిన కేఎంసీ క్యాంటీన్ వివాదం

- తాళం వేసిన రోజే పగులగొట్టిన వైనం
- ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిన వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని క్యాంటీన్ వ్యవహారం రోజురోజుకు ముదిరి పాకాన పడుతోంది. ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ క్యాంటీన్ ఓ వ్యక్తి చేతిలో ఉందని సంఘం ఆరోపిస్తుండగా, అసలు సంఘమే లేదని, వారికి అడగాల్సిన హక్కులేదని క్యాంటీన్ నిర్వాహకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సంఘం నాయకులు తాళం వేయగా అదే రోజు రాత్రి నిర్వాహకుడు తాళాలను పగులగొట్టి క్యాంటీన్‌ను తెరిచారు. దీంతో మంగళవారం సంఘం నాయకులు పోలీసుల రక్షణతో క్యాంటీన్‌ను స్వాధీనం చేసుకుంటామని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్‌ను కోరారు.

వైద్యుల వసతి గృహం కోసం కళాశాలలోని కొంత స్థలాన్ని ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం వారు గతంలో కోరడంతో అప్పటి అధికారులు 99 ఏళ్ల లీజుకు ఇచ్చారు. ఆ స్థలంలో వసతి గృహంతో పాటు భవనం నిర్మించి ఓ బ్యాంకుకు అద్దెకు ఇచ్చారు. మిగిలిన స్థలంలో క్యాంటీన్ ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. ఈ మేరకు అప్పటి సంఘంలోని పలువురు సభ్యుల సంతకాలతో డాక్టర్ వరప్రసాద్‌కు లీజుకు ఇచ్చారు. ఆ స్థలంలో క్యాంటీన్ నిర్మాణం పూర్తి చేసి పదేళ్లకు పైగా నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను నెలకు రూ.4 వేలు అద్దె చెల్లించే విధంగా, రెండేళ్లకోసారి 10 శాతం అద్దె పెంచేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మధ్యమార్గంలో ఇంకో వ్యక్తి క్యాంటీన్ నిర్మాణం చేపట్టి కొంతకాలం నిర్వహించి అద్దె చెల్లిస్తూ వచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. అతను ఎవరికి, ఎంత అద్దె చెల్లించారనే విషయాలు బయటకు రావడం లేదు. వివాదం నడుస్తున్న సమయంలో మరో వ్యక్తి క్యాంటీన్ తీసుకుని నిర్వహించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ వ్యక్తి నెలకు రూ.70 వేలకు పైగా అద్దె చెల్లించి నిర్వహించారని సంఘం నాయకులు విమర్శలు చేస్తున్నారు. ఇదే క్రమంలో క్యాంటీన్ అగ్రిమెంట్ వ్యవహారం తెరమీదకు వచ్చింది. ఐదేళ్లకు లీజుకు ఇస్తే అగ్రిమెంటును ఫోర్జరీ చేసి 30 ఏళ్లుగా దిద్దుకుని కొనసాగిస్తున్నారని సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. తమకు 30 ఏళ్లకే లీజుకు ఇచ్చారని, ఈ వ్యవహారం కోర్టులో చూసుకుంటామని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో గత పదిరోజులుగా ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరుగుతోంది.

రాష్ట్ర విభజన తర్వాత సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదని, అలాంటప్పుడు తనను ఎలా ప్రశ్నిస్తారని, ఇప్పటివరకు బ్యాంకు అద్దె ఎవరి ఖాతాలో వేసుకున్నారని, సంఘం పేరు చెప్పుకుని ధనార్జన చేయడానికి వచ్చారని నిర్వాహకులు డాక్టర్ వరప్రసాద్ విమర్శలు గుప్పించారు. జిల్లాలో లేని వ్యక్తి సంఘంలో ఉండరని, సంఘమే లేనప్పుడు ఆయన కూడా సంఘంలో ఎలా ఉంటాడని, అలాంటప్పుడు క్యాంటీన్ ఎలా నిర్వహిస్తారని సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో సంఘం నాయకులు క్యాంటీన్‌కు తాళం వేయడం, దానిని నిర్వాహకులు పగులగొట్టి తిరిగి క్యాంటీన్ నిర్వహించడం వివాదస్పదంగా మారింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఆసుపత్రి, మెడికల్ కాలేజీ అధికారులు ముందుకు రాకపోవడం గమనార్హం. దీంతో క్యాంటీన్ విషయం ఎంతదాకా వెళుతుందోనని వైద్యులు చర్చించుకుంటున్నారు.



తాళాలు పగులగొట్టి క్యాంటీన్‌ను తెరచిన దృశ్యం

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు (టౌన్): క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక బి.క్యాంపులోని శ్రీలక్ష్మీ టీజీ వెంకటేష్ కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి 10వ సబ్‌జూనియర్ 11వ జూనియర్, సీనియర్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడల వల్ల ఆపద సమయాల్లో తమని తాము కాపాడుకోవడంతో పాటు ఇతరులను రక్షణ కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. క్రీడాకారులు స్ఫూర్తిని ప్రదర్శించి పోటీలలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభను కనబరచిన క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రాష్ట్ర ఉషూ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆది విష్ణు, నరసింహారావు, జిల్లా ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఫేక్ హామీలతో చంద్రబాబు మోసం

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన అబద్ధపు హామీలు ప్రజల ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలను అమలుచేస్తామని చెప్పిన కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, పురందేశ్వరి ఎందుకు మిన్నకుండి పోయారని ప్రశ్నించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి లోకేష్ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. పాదయాత్రలో ఎన్నో హామీ లు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయడం లేద న్నారు. జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 33 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. మరోవైపు సూపర్‌సిక్స్ హామీలు ఎప్పటిలోగా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాలు విడుదల



కేధార్ నాథ్ రెడ్డి, రిడ్జ్ స్కూల్ | ఎస్.నందినిరెడ్డి, రిడ్జ్ స్కూల్ | టి.వి తేజోదయ్, రిడ్జ్ స్కూల్



డి.లాస్య రెడ్డి (కట్టమంచి స్కూల్) | ఎం.నరసింహా (మాంటిస్సోరి ఒలంపస్) | డి.తైసర్ (మాంటిస్సోరి ఒలంపస్)

కర్నూలు సిటీ: పదో తరగతి సీబీఎస్ఈ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగాయి. పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తా చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా యాజమాన్యాలు అభినందించాయి.

- నగర శివారులోని కట్టమంచి రామలింగారెడ్డి సెకండరీ (శ్రీచైతన్య అకడమిక్ మేనేజ్‌మెంట్)స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఏజీఎం సురేష్ తెలిపారు. డి.లాస్యరెడ్డి అనే విద్యార్థి 496/500 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.
- రిడ్జ్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు సీఈఓ జి.గోపీనాథ్ తెలిపారు. మొత్తం 111 మంది పరీక్షలు రాయగా 102 మంది 60 శాతానికిపైగా మార్కులు సాధించారన్నారు. టి.కేధార్ రెడ్డి 486, ఎస్.నందిని రెడ్డి 479, టీవీ.తేజోదయ్ 478 మార్కులతో ప్రతిభ చాటారన్నారు.
- మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్ (ఏక్యాంపు) విద్యార్థులు మొత్తం 285 మంది పరీక్షలు హాజరుకాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి తెలిపారు. ఐ.వి.లలిత్‌కుమార్ రెడ్డి 491, శివ హర్షిల్ రెడ్డి 488 మార్కులు, ఎ.అభిషాయ్ 487 మార్కులతో సత్తా చాటారన్నారు.
- పంచలింగాల వద్ద ఉన్న మాంటిస్సోరి సీబీఎస్ఈ ఒలంపస్ బ్రాంచ్‌కి చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులైనట్లు డైరెక్టర్ కె.ఎస్.వి రవి ప్రకాష్ తెలిపారు. విద్యార్థులు నరసింహ 482, తైసిర్ 481 మార్కులతో సత్తా చాటుకున్నారని వెల్లడించారు.
- మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్‌కి చెందిన విద్యార్థులు 765 మంది పరీక్షలకు హాజరుకాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాళ్లు కె.శ్రీనివాసరెడ్డి, మీనాక్షి విల్సన్ తెలిపారు. సి.హర్షంత్ 488, పి.సురేంద్ర, బి.విక్రమ్ ఆదిత్య 484 మార్కులు సాధించారన్నారు.


అక్రమ సస్పెన్షన్లు ఆపాలి



జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కర్నూలు సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పలు దఫాలుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు, యాజమాన్యం పట్టించుకోకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చలో జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జోనల్ కార్యదర్శి ఎం.చెన్నా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం జారీ చేసిన సర్క్యులర్ 1/2019ని అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తుంటే కొంతమంది అధికారులు ఆ సర్క్యులర్‌ను వక్రీకరిస్తున్నారన్నారు. చిన్న పొరపాట్లకు సిబ్బందిని సస్పెండ్ చేయడం, సర్వీసు నుంచి తొలగిస్తున్నారని, అలాంటి వాటిని ఆపాలని, నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీలో మాదిరిగానే క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలని,114 జీఓలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150 నుంచి రూ.400కు పెంచాలని, కోరారు. ధర్నాలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్ఆర్ నాయుడు, జిల్లా కార్యదర్శి సి.మద్దిలేటి, జిల్లా చైర్మెన్ గౌస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీ.ఏ వలి, డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు కల్చరల్: దేశ రక్షణ కోసం సైనికులు చేసిన త్యాగాలు మరువలేనివని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ అన్నారు. జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భరతమాత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నాట్యాచార్యులు నారాయణస్వామి, నాగ సాయిప్రదీప్, దేవిశ్రీ, కరీముల్లా, రోహిత్‌లను సత్కరించి పారితోషికం అందజేశారు. డీఈఓ శామ్యూల్ పాల్ ప్రసంగిస్తూ రాయలసీమ వాసి అయిన మురళీనాయక్ వీర మరణాన్ని కొనియాడారు. ఆయనను ధైర్యశాలిగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను కొనియాడారు.

ఓమ్నీ కారులో మంటలు

– రూ.లక్ష నష్టం



మంటల్లో తగలబడిపోతున్న ఓమ్నీ కారు

కర్నూలు: కర్నూలు శివారులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సస్య హీరో షోరూం వద్ద మారుతీ ఓమ్నీ కారు అగ్ని ప్రమాదానికి గురైంది. బద్వేలు పట్టణానికి చెందిన ఆయుర్వేద మందుల వ్యాపారి దుర్గేష్ కొంతకాలంగా నందికొట్కూరు రోడ్డులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉంటూ కర్నూలులో ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఏపీ 04 ఏకే 7751 నంబరు గల మారుతీ ఓమ్నీ కారులో ఆయుర్వేద మందులతో కర్నూలు నగరంలోకి వస్తుండగా సస్య హీరో షోరూం వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై కారు దిగడంతో ప్రమాదం తప్పింది. సస్య హీరో షోరూం నిర్వాహకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే కారులో ఉన్న ఆయుర్వేద మందులతో పాటు ఇంజన్, సీట్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.లక్ష దాకా నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

శ్రీరామ రూరల్ హైస్కూల్‌కు 'సైనిక్' హోదా



పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

కర్నూలు సిటీ: తెనాలి సమీపంలోని కొల్లూరు మండలం చిలుమూరులో ఉన్న శ్రీరామ రూరల్ హైస్కూల్‌కు భారత రక్షణ అకాడమీ సైనిక్ స్కూల్‌గా అనుమతులు ఇచ్చినట్లు ఏపీ ప్రైవేటు అన్-ఎయిడెడ్ స్కూళ్ల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసీ విష్ణుప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక కేవీఆర్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశంలో మొత్తం 33 సైనిక్ స్కూళ్లు ఉన్నాయని, తాజాగా ఏపీలో రెండు స్కూళ్లకు సైనిక్ స్కూళ్లుగా అనుమతులు రాగా.. శ్రీరామ రూరల్ హైస్కూల్ ఒకటి కావడం గర్వకారణంగా ఉందన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రతిభావంతులైన విద్యార్థులు ఆరో తరగతిలో అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఏపీ ప్రైవేటు అన్‌ఎయిడెడ్ యాజమాన్యాల సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవయ్య, నాగరాజు, ఆ సంఘం సిటీ కార్యదర్శి కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



గడియారం ఆసుపత్రిలో వసతులు పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ అశోక్‌నగర్, ఆనంద్ థియేటర్ సమీపంలోని శ్రీ బసవ సర్కిల్, గడియారం ఆసుపత్రి, అమీర్ హైదర్‌ఖాన్ ప్రాంతాల్లో పర్యటించారు. హంద్రీ నదిలో జరుగుతున్న ముళ్ల పొదల తొలగింపు పనులను పరిశీలించారు. ఆనంద్ థియేటర్ సమీపంలోని కిసాన్ ఘాట్‌కు వెళ్లే మార్గాన కూడలి ఏర్పాటు, గడియారం ఆసుపత్రి ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ గంగాధర్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారస్తులుగా నమోదు చేసుకోండి

కర్నూలు (టౌన్): నగరంలోని వీధి వ్యాపారులందరూ సచివాలయ కార్యదర్శుల ద్వారా చేపడుతున్న సర్వేలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కమిషనర్ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీధి వ్యాపారుల కోసం స్మార్ట్ సిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు వీధి వ్యాపారులు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, విజయ్ రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం సుర్జీత్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలన్నారు. మరోవైపు 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెకు మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు.

స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. మంగళవారం నగర కార్యదర్శి సుధాకరప్ప, ఎస్ఎండీ షరీఫ్ అధ్యక్షతన సీఐటీయూ న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీల ఆధ్వర్యంలో బుధవారపేట, శ్రీరామ్‌నగర్‌లో స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని, కరెంట్ బిల్లులను తగ్గించాలని కోరుతూ ముద్రించిన స్టిక్కర్లను ఇంటింటా అతికించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను బిగించడం అన్యాయమన్నారు.